


బురహాన్‌పురం ప్రచారంలో బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్



బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే రెడ్యానాయక్

# అందుబాటులో ఉండేది.. అభివృద్ధి చేసేది నేనే..

- నా జీవితం ప్రజలతోనే మమేకం
- మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే
- కాంగ్రెస్‌కు ఓటేస్తే పదేళ్ల ప్రగతి వెనక్కి
- డోర్నకల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రెడ్యానాయక్

మరిపెడ, నవంబర్ 24: తన 40 ఏండ్ల రాజకీయ జీవితం డోర్నకల్ నియోజకవర్గ ప్రజలతో మమేకమైందని, అందుబాటులో ఉండేది, అభివృద్ధి చేసేది తానేనని బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డప్పుచప్పుళ్లు గిరిజన మహిళల నృత్యాలతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రిగా పని చేసిన సమయంలోనూ చిన్నగూడూరు మండలం మచ్చతండాల్లో సాధారణ జీవితం గడిపి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తన కుటుంబ సభ్యులుగా భావించి నిస్వార్థంగా పని చేశానని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు స్థానికుడు, స్థానికేతరుడికి మధ్య జరుగుతున్న సమరమన్నారు. రాజకీయాలకతీతంగా అందుబాటులో ఉండే తనకు ఓటు వేసి ఆదరించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్, సాగు, తాగునీటి గోస చవి చూశామన్నారు. 11 సార్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే కనీసం గుక్కెడు తాగునీళ్లు అందించలేకపోయిందన్నారు. దళిత, గిరిజనుల ప్రగతిని పట్టించుకోలేదన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం జాతీయస్థాయిలో గుర్తింపు సాధించిందన్నారు. కులవృత్తిదారులకు గ్రామాల్లోనే ఉపాధి కల్పించడంతో వలసలు ఆగిపోయాయన్నారు. దళితబంధు పథకం దళిత కుటుంబాల్లో ఆత్మగౌరవం కల్పించిందన్నారు. తొలుత నియోజకవర్గంలో రూ.10 కోట్లతో వందమందికి అందజేసి రెండో విడతలో మరో వెయ్యి మందికి అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని ఆకేరువాగుపై దంతాలపల్లి, ఉల్లేపల్లి, డోర్నకల్ వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.50కోట్లు నిధుల, రోడ్ల నిర్మాణం కోసం రూ.350 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ కేంద్రాల్లో సుస్థిరమైన ప్రగతి సాధించడం కోసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. విజ్ఞులైన ఓటర్లు గ్రామాల్లో జరిగిన ప్రగతిని చూసి ఓటెయ్యాలని కోరారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వమే రానుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ నవీన్ రావు, ఎంపీపీ అరుణా రాంబాబు, జడ్పీటీసీ శారదా రవీంద్రనాయక్, డీసీసీబీ డైరెక్టర్ యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు టీ శ్రీనివాస్, రాంలాల్, వెంకట్రాం నర్సయ్య, కిషన్‌రెడ్డి, శ్వేతా ముఖేశ్, రావుల వెంకటరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ఆయూబ్ పాషా పాల్గొన్నారు.

### పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి

పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బురహాన్‌పురంలో ఏర్పాటు చేసిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమైక్యరాష్ట్రంలో నెలకొన్న తెలంగాణ దుస్థితి స్వరాష్ట్రంలో జరిగిన ప్రగతిపై ప్రజలకు వివరించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. ప్రభుత్వం వ్యవసాయరంగానికి పునరుజ్జీవం పోసిందన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నిత్యం అందుబాటులో ఉండే తనకు ఓటు వేయాలని కోరారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఓటర్లను కలిసి సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలిచిన విషయం తెలియజేయాలన్నారు. సమావేశంలో గ్రంథాలయం చైర్మన్ నవీన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ యాదగిరి రెడ్డి, కుడితి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీ రాంలాల్, బాల్నె మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల పాడులో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు →

### బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

బయ్యారం, నవంబర్ 24 : బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమమని ఆ పార్టీ యూత్ నాయకులు లక్ష్మణ్ నాయక్, రేపాకుల వెంకన్న అన్నారు. మండలంలోని ఉప్పలపాడు , బాలాజీపేట గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్‌కు ప్రజలు మద్దతుగా నిలువాలని కోరారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావాలని సీఎం కేసీఆర్ సీఎం కావాలన్నారు. అందుకోసం బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి బానోత్ హరిప్రియను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# హోమ్ ఓటింగ్‌పై సర్వత్రా హర్షం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, నవంబర్ 24 : ఎన్నికల్లో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు ఏర్పాటు చేసిన హోమ్ ఓటింగ్ పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక తెలిపారు. రెండు రోజుల నుంచి జిల్లాలో ఎన్నికల సిబ్బంది హోమ్ ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. కురవిలో ఓటింగ్‌ను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వృద్ధుడు కృష్ణారావు, దివ్యాంగుడు కొమురయ్యతో కలెక్టర్ మాట్లాడారు. ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఓటు వేయడానికి నానా ఇబ్బందులు పడే వారమని వెల్లడించారు. నేడు అలాంటి పరిస్థితికి స్వస్తి పలికి ఎన్నికల కమిషన్ తీసుకొచ్చిన హోమ్ ఓటింగ్ ప్రక్రియ బాగుందన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సరస్వతి, అధికారులు పాల్గొన్నారు.

### డోర్నకల్‌లో..

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపాలిటీ, గ్రామాల్లో 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును శుక్రవారం వినియోగించుకున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ, 30 గ్రామాల్లో 58 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 98 శాతం ఓటేసినట్లు అధికారులు తెలిపారు.

### మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కేసులు తగ్గించాలి

మహబూబాబాద్ : మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కేసులు తగ్గించేందుకు పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ శశాంక విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెలిప్యాడ్‌కు యూజర్ చార్జీలు చెల్లించి వాడుకోవచ్చన్నారు. సువిధ యాప్ నుంచి అందరికీ సమానంగా అనుమతులు ఉండడానికి ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టామని తెలిపారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈవో రమాదేవి, ఎలక్షన్ విభాగం అధికారులు పవన్‌కుమార్, రంజిత్, పార్టీల ప్రతినిధులు సురేశ్‌నాయుడు(ఐఎన్‌సీ), సంపత్‌రావు (బీజేపీ), పెరుగు కుమార్ (సీపీఐ), మార్నేని వెంకన్న (బీఆర్‌ఎస్) స్వతంత్ర అభ్యర్థులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ : కురవిలో ఇంటి వద్ద ఓటు వేస్తున్న వృద్ధుడు కృష్ణారావు, చిత్రంలో కలెక్టర్ శశాంక

### ఈవీఎం, వీవీ ప్యాట్ల పరిశీలన

మరిపెడ : మున్సిపల్ కేంద్రంలోని సెయింట్ ఆగస్టీన్ స్కూల్‌లో స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ శశాంక శుక్రవారం పరిశీలించారు. డోర్నకల్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్ల కమిషనింగ్ పనులను పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియ పనులను వేగవంతం చేయాలని రిటర్నింగ్ అధికారి నరసింహారావును ఆదేశించారు. అనంతరం మరిపెడ, అబ్బాయిపాలెం, బీచ్‌రాజుపల్లి, తండధర్మారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓటరు స్లిప్పులను తప్పనిసరిగా ఓటర్లకు అందజేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది శ్రీనివాస్‌రావు, సునీల్‌రెడ్డి, సైదులు, ఎంపీడీవో ధన్‌సింగ్, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.



ములుగు సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

### సీఎం సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

గంగారం, నవంబర్ 24 : ములుగులో ప్రజా ఆశీర్వాద సభకు మండల పరిధిలోని ప్రతి గ్రామం, తండా, గూడెం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి వెళ్లాయి. బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో 25 డీసీఎం వాహనాల్లో 2 వేల మంది వెళ్లారు. ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు సమ్మయ్య, లక్ష్మయ్య, యాకయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

### ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

దంతాలపల్లి, నవంబర్ 24: స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో అధికారులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ తీశారు. బ్యాంకు నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఓటర్లందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని వంద శాతం ఓటింగ్‌కు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డీటీ శ్రీదేవి, ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ నాగమణి

### కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలి

**ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి**

గార్ల, నవంబర్ 24 : రేవంత్‌రెడ్డి డబ్బులకు టికెట్ అమ్ముకుంటే, పొంగులేటి శ్రీనివాస్ డబ్బులకు టికెట్లు కొని రాజకీయాలకు విలువ లేకుండా చేశాడని వారికి ప్రజలు బుద్ధి చెప్పాలని సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క రాజకీయాలను సంతలో ఆటబొమ్మలుగా మార్చారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ప్రతి గడపకూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఇల్లెందు ఆడబిడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియా నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, ఎంపీపీ మాలు శివాజీ చౌహాన్, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు పీ రాధాకృష్ణ, మండల కోఆప్షన్ ఖాదీర్ బాబా, మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేశ్, బీసీ సెల్ నాయకుడు తోట కొండల్‌రావు, బాలూ నాయక్ పాల్గొన్నారు.

### రోడ్డుపై గుంతలను పూడ్చిన యువకులు

దంతాలపల్లి, నవంబర్ 24: మండల పరిధిలోని దంతాలపల్లి– సూర్యాపేట రహదారిలో కుమ్మరికుంట్ల గ్రామం స్టేజి వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదలు జరుగుతున్నాయి. దీంతో గ్రామానికి చెందిన యువకులు కంకర, సిమెంట్‌తో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా యువకులను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో కారుపోతుల అనిల్, ఎస్‌కే మదర్, యాకయ్య పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

డోర్నకల్, నవంబర్ 24 : కొత్త తండాలోని ఓ బెల్టు షాపులో శుక్రవారం పోలీసులు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ర్యూనీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త తండాకు చెందిన ధరావత్ కుమార్ వద్ద రూ. 5 వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.